

కొంగొత్త ఆశలతో..

హ్యాపీ న్యూ ఇయర్

- సందడిగా నూతన సంవత్సర వేడుకలు
- ఆలయాల్లో ప్రత్యేక పూజలు
- పార్టీలు, డ్యాన్స్‌లతో యువత జోష్
- ఆకట్టుకున్న రంగవల్లులు

మల్కాపురం/విశాఖ విద్య: పశ్చిమ నియోజకవర్గం లోని ప్రతి వీధిలో హ్యాపీ న్యూ ఇయర్ సందడి నెలకొంది. మహిళలు ఇళ్ల ముందు 2024కి గుడ్‌బై చెబుతూ..2025కి స్వాగతం పలుకుతూ వేసిన ముగ్గులు ఆకట్టుకున్నాయి. రాత్రి 9 గంటల నుంచే న్యూయర్ సందడి నెలకొంది. రోడ్లపై యువకులు కేరింతలు కొడుతూ చేస్తూ ఎంజాయ్ చేశారు. రాత్రి 11 నుంచి కొత్త సంవత్సరం రాకకోసం ఎదురు చూశారు. సరిగ్గా 12 గంటలకు న్యూఇయర్‌ను ఆహ్వానిస్తూ పెద్ద ఎత్తున కేరింతలు కొడుతూ రోడ్లపై పరుగులు తీశారు. ప్రతి ఒక్కరికి న్యూ ఇయర్ శుభాకాంక్షలు చెబుతూ ఆప్యాయత..అనురాగాలు పంచుకున్నారు. స్నేహితులతో పార్టీలు, డిన్నర్, కేక్ కటింగ్ వంటి సెలబ్రేషన్స్‌లో మునిగిపోయారు.

న్యూఇయర్ సందడి

న్యూ ఇయర్ వేళ మార్కెట్లలో సందడి నెలకొంది. స్వీట్ షాప్‌లు, బేకరీలు, పూల దుకాణాలు, ఫ్రూట్‌షాప్స్, గిఫ్ట్ షాప్స్ కొనుగోలుదారులతో కిటకిటలాడాయి. స్నేహితులు, కుటుంబ సభ్యులు కలిసి న్యూఇయర్ వేడుకలు ఉత్సాహంగా జరుపుకున్నారు. బిర్యానీ సెంటర్లు, ఫాస్ట్ ఫుడ్ సెంటర్ల వద్ద రద్దీ నెలకొంది. దీంతో మల్కాపురం, సింధియా, ఎన్ఏడీ, గోపాలపట్నం, కంచరపాలెం ప్రాంతాల్లో బిర్యానీ సెంటర్లు, ఫాస్ట్ ఫుడ్ దుకాణాలు, స్వీట్‌షాప్‌లు, బేకరీలు వినియోగదారులతో కిక్కిరిసిపోయాయి. వినియోగదారుల అభిరుచికి తగినట్టు కేక్‌లు సిద్ధం చేసి విక్రయించారు.


నూతన సంవత్సర వేడుకలు అంబరాన్ని అంటాయి. కొత్త సంవత్సరాన్ని పురస్కరించుకొని యువతీ యువకులు కేరింతలు కొట్టారు. పాత సంవత్సరానికి గుడ్‌బై చెబుతూ.. నూతన సంవత్సరానికి స్వాగతం పలుకుతూ ఎంజాయ్ చేశారు. కొత్త సంవత్సరంలో కొత్త లక్ష్యాలు, సరికొత్త ప్రణాళికతో విజయపథాన ముందుకు సాగాలని నిర్ణయాలు తీసుకున్నారు. గతేడాది కంటే న్యూఇయర్‌లో మరింత ఉన్నతి సాధించడానికి ప్రణాళికలు రూపొందించుకుంటున్నారు.

మంచి జరగాలని పూజలు

కొత్త సంవత్సరంలో అందరికీ మంచి జరగాలని మల్కాపురం రామాలయంలో మంగళవారం సాయంత్రం ప్రత్యేక పూజలు చేశారు. మహిళలు పాల్గొని హనుమాన్,లక్ష్మణ,సీతా సమేత రామచంద్రుడికి ప్రత్యేకంగా ఆరాధించారు.

సరి'కొత్త'గా శుభాకాంక్షలు

టెక్నాలజీ కొత్త పుంతలు తొక్కుతున్న నేటి రోజుల్లో న్యూ ఇయర్ శుభాకాంక్షలు చెప్పుకోవడంలోనూ ట్రెండ్ మారింది. ఒకప్పుడు గ్రీటింగ్ కార్డులు పంచే సంప్రదాయం ఉండగా ఇప్పుడు అంతా సామాజిక మాధ్యమాలను వేదికగా చేసుకున్నారు. వాట్సాప్, ఫేస్‌బుక్, ట్విట్టర్ ,ఇన్‌స్ట్రాగామ్‌లలో హ్యాపీ న్యూ ఇయర్ అంటూ శుభాకాంక్షలు చెప్పుకున్నారు.



నూతన సంవత్సరానికి స్వాగతం పలుకుతూ పెయింటింగ్

కెనడాలో జాబ్ చేస్తా



కొత్త సంవత్సరం కోటి ఆశలతో ఉన్నాను. ఎంఎస్‌ఈ పూర్తి చేశాను. నా చదువు తగ్గ ఉద్యోగం కోసం ఎదురు చూస్తున్నాను. కెనడా వెళ్లి అక్కడ మంచి ఉపాధి పొంది.. ఆ ఆదాయం ద్వారా నా కుటుంబాన్ని సంతోషంగా చూసుకుంటాను. ఆర్థికంగా వెనుకబడిన విద్యార్థులకు నా వంతు సాయం చేసే స్థాయిలో ఉండాలని ఆశిస్తున్నాను.కొత్త సంవత్సంలో నా కోరిక నెరవేరుతుందని నమ్మకంతో ఉన్నా..

–మౌనికాయాదవ్, ఎంఎస్‌ఈ, మల్కాపురం



అంతా బాగుండాలి



కొత్త సంవత్సరంలోకి అడుగుపెడుతున్నామంటే అందరిలోనూ కొత్త ఆలోచనలు రేకెత్తుతుంటాయి. గడిచిన జ్ఞాపకాలను గుర్తుకు తెచ్చుకుంటూ ప్రతీ ఒక్కరూ భవిష్యత్‌కు బంగారు బాటలు వేసుకోవాలి. చేపట్టే పనులు విజయం సాధించేలా పక్కా ప్రణాళికతో ముందుకెళ్లాలి. అంతా ఆయురారోగ్యాలతో బాగుండాలి.

– డాక్టర్ శిరీష కంచిపాటి, దంతవైద్య నిపుణురాలు, మర్రిపాలెం వుడా కాలనీ



గోపాలపట్నంలోని ఓ స్వీటు దుకాణంలో సందడి



ఇంటి ముందు రంగవల్లి సిద్ధం

అమెరికాలో ఎంఎస్ చేస్తా..



ప్రస్తుతం బీటెక్ (మెకానికల్) నాలుగో సంవత్సరం చదువుతున్నాను. బీటెక్ అనంతరం అమెరికాలో ఎంఎస్ చదవాలన్నది నా లక్ష్యం. కొత్త సంవత్సరంలో అంతా అనుకూలిస్తే రయ్‌మని అమెరికా వెళ్తాను.

– ఎదురు విక్రమ్, బీటెక్, గాంధీజీవీధి

సచివాలయ ఉద్యోగుల సంఘం క్యాలెండర్ ఆవిష్కరణ



ఉద్యోగులతో కలిసి క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే గణబాబు

విశాఖ విద్య : సచివాలయ ఉద్యోగుల సంఘం (ఏపీడబ్ల్యూఎస్‌జీఈఏ) క్యాలెండర్‌ను ఎమ్మెల్యే గణబాబు మంగళవారం ఆవిష్కరించారు. అసోసియేషన్ నాయకులు నాగేశ్వరరావు ఆధ్వర్యంలో సభ్యులంతా ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయానికి వెళ్లి ముందస్తుగా ఎమ్మెల్యే గణబాబుకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో ముద్రించిన 2025 క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. అసోసియేషన్ నాయకులు పార్థసారథి, శ్రీనివాసు, శివ, కొండలరావు తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులు వేగవంతం చేయాలి

విశాఖ విద్య : కాలనీల్లో మౌలిక సౌకర్యాలు పెంపొందించే క్రమంలో చేపడుతున్న అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని కార్పొరేటర్ బొమ్మిడి రమణ అన్నారు. జీవీఎంసీ 90వ వార్డు పరిధి సుసర్ల కాలనీ చంద్రమౌళీశ్వరస్వామి ఆలయం వద్ద డ్రైనేజీ నిర్మాణ పనులును మంగళవారం జీవీఎంసీ ఎస్ఈ రామ్మోహన్‌తో కలిసి ఆయన పరిశీలించారు. డ్రైనేజీ ఆధునికీకరణలో భాగంగా రూ.19.93 లక్షలతో పనులు చేపడుతున్నామని తెలిపారు. కార్యక్రమంలో వర్క్ ఇన్‌స్పెక్టర్ రామకృష్ణ, శ్రీను, సతీష్, నాగేశ్వరరావు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన

మల్కాపురం : జీవీఎంసీ 59వ వార్డు కొత్త నక్కవానిపాలెం గ్రామంలో సుమారు రూ.15 లక్షల వ్యయంతో బీటీ రోడ్డు నిర్మాణ పనులకు మంగళవారం భూమి పూజ చేశారు. ఈ ప్రాంతంలో బీటీ రోడ్డు పూర్తిగా శిథిలావస్థకు చేరిందని, దీంతో జీవీఎంసీ నిధులతో రోడ్డు నిర్మాణ పనులు చేపడుతున్నట్లు అధికారులు తెలిపారు. స్థానిక నాయకులు పుర్రె సురేష్ యాదవ్, నక్క లక్ష్మణరావు, తదితరులు పాల్గొన్నారు.

వేంకటేశ్వరునికి నవనీత అలంకరణ



నవనీత అలంకరణలో వేంకటేశ్వర స్వామి, స్వామివారిని దర్శించుకుంటున్న భక్తులు

విశాఖ విద్య : జీవీఎంసీ 90వ వార్డు విమాన్ నగర్‌లో వేంచేసి ఉన్న వైకుంఠ వేంకటేశ్వర స్వామి ఆలయంలో ధనుర్మాసోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. ఇందులో భాగంగా మంగళవారం వైకుంఠ వేంకటేశ్వరుడికి నవనీత సేవ అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఆలయ అర్చకులు గౌతం కుమార్ ఆధ్వర్యంలో అర్చక బృందం స్వామికి 16వ పాశురం వినిపించారు. విమాన్ నగర్ కాలనీ అసోసియేషన్ సెక్రటరీ పి.నాగు, లలిత కుమారి దంపతులు, వారి కుటుంబ సభ్యులు ఆధ్వర్యంలో ధనుర్మాస పూజలు జరిపించారు. వేడుకల్లో భాగంగా తెల్లవారుజామున స్వామికి పంచామృతాలతో అభిషేకం చేశారు. అనంతరం నవనీత అలంకరణ చేసి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు డి.భీమారావు, కార్యదర్శి పి.రాజు, నిర్వాహక కమిటీ సభ్యులు పి.రవి, బి.శ్రీనివాసు, వి.శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

ఆసక్తికరంగా వైజ్ఞానిక ప్రదర్శన



సైన్స్ నమూనాలతో విద్యార్థులు



వైజ్ఞానిక ప్రదర్శనను పరిశీలిస్తున్న జెడ్పీ రాము

మురళీనగర్ : మాధవధార జీవీఎంసీ ఉన్నత పాఠశాలలో గోపాలపట్నం మండల స్థాయి వైజ్ఞానిక ప్రదర్శన మంగళవారం ఆసక్తికరంగా సాగింది. జోన్ – 5 జోనల్ కమిషనర్ బి.రాము పోటీలను ప్రారంభించారు. మండలంలోని 11 పాఠశాలలకు చెందిన విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొని తమ సృజనాత్మకతను ప్రదర్శించారు. విద్యార్థుల వ్యక్తిగత ప్రాజెక్టులు 10, సామూహిక ప్రాజెక్టులు 14, ఉపాధ్యాయుల వ్యక్తిగత విభాగంలో 6 ప్రాజెక్టులు ప్రదర్శించారు. జోనల్ కమిషనర్ బి.రాము ప్రాజెక్టులను పరిశీలించి విద్యార్థులను ప్రశంసించారు. వ్యక్తిగత విభాగంలో ఏపీఎస్‌డబ్ల్యూఎస్ మేఘాద్రి గెడ్డ పాఠశాల విద్యార్థి కె.సోనిక తయారు చేసిన హైడ్రాలిక్ మెషీన్ లాంచింగ్, గ్రూప్ ప్రాజెక్ట్ విభాగంలో కె.లోహిత, వై.హిమబిందు తయారు చేసిన ఆటోమేటిక్ సేఫ్టీ ఆక్సిడెంట్ అలర్ట్ సిస్టం, ఉపాధ్యాయుల వ్యక్తిగత ప్రాజెక్టుకి సంబంధించి గోపాలపట్నం జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాల గణిత ఉపాధ్యాయుడు బి.లలిత ప్రసాదరావు తయారు చేసిన మ్యాథ్స్ టీచింగ్ లెర్నింగ్ మెటీరియల్‌ను ఎంపిక చేశారు. వీరు ఈ నెల 3న తోటగరువు ఉన్నత పాఠశాలలో నిర్వహించనున్న జిల్లా స్థాయి పోటీల్లో పాల్గొంటారు. పాఠశాల హెచ్ఎం బి.హేమలత పర్యవేక్షణలో నిర్వహించిన కార్యక్రమంలో ఉపాధ్యాయులు, ఇతర పాఠశాలల హెచ్ఎంలు పాల్గొన్నారు.

అబ్బురపరిచిన సైన్స్ ఎగ్జిబిషన్

సీతమ్మధార : స్థానిక వసంతబాల పాఠశాలలో మంగళవారం మండల స్థాయి సైన్స్ ఫెయిర్ ఘనంగా ప్రారంభమైంది. సీతమ్మధార మండల పరిధిలోని ఆరు ఉన్నత పాఠశాలలు, ఒక ప్రాథమికోన్నత పాఠశాల విద్యార్థులు, ఉపాధ్యాయులు ప్రదర్శనలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రదర్శించిన నమూనాలు పలువురిని అబ్బురపరిచాయి. ముఖ్య అతిథిగా విచ్చేసిన బీజేపీ నాయకురాలు శ్యామలా దీపిక మాట్లాడుతూ విద్యార్థుల్లో సైన్స్ పట్ల ఆసక్తి పెంచడానికి ఎగ్జిబిషన్లు ఎంతగానో దోహదపడతాయన్నారు. ఈ సందర్భంగా 31 నమూనాలు ప్రదర్శించారు.

ఘనంగా అంబలం పూజ



పూజ చేస్తున్న భక్తులు

మల్కాపురం : జీవీఎంసీ 61వ వార్డు మల్కాపురం, నగరాల వీధి వద్ద స్థానిక అయ్యప్ప స్వామి భక్తులు అంబలం పూజ ఘనంగా నిర్వాహించారు. మంగళవారం సాయంత్రం నిర్వహించిన పూజలో పారిశ్రామిక ప్రాంత అయ్యప్ప భక్తులు పాల్గొని స్వామియే శరణమయ్యప్ప అంటూ కీర్తించారు. అరటి దువ్వలతో పీఠం ఏర్పాటు చేసి పూజలు చేశారు. అనంతరం భక్తులకు ప్రసాదం పంపిణీ చేశారు.

పింఛన్ల పంపిణీ

మల్కాపురం: జీవీఎంసీ 58వ వార్డు శ్రీరామ్‌నగర్‌లో మంగళవారం సామాజిక పింఛన్లను ఎమ్మెల్యే గణబాబు పంపిణీ చేశారు. కార్యక్రమంలో నాయకులు కోరాడ శ్రీను,పోతబత్తుల శ్రీను తదితరులు పాల్గొన్నారు.

దోపిడీ కేసులో ఆరుగురి అరెస్ట్



వివరాలు వెల్లడిస్తున్న జోన్-2 ఏసీపీ లక్ష్మణరావు

ఉక్కునగరం: కూర్మన్నపాలెం దరి స్టీల్ ప్లాంట్ ఆర్చి వద్ద రోడ్డు పక్కన గత నెల 27న కాలకృత్యాలు తీర్చుకుంటున్న వ్యక్తిపై దాడి చేసి నగదు దోపిడీ చేసిన కేసులో క్రైం పోలీసులు ఆరుగురిని అరెస్ట్ చేశారు. వివరాలను మంగళవారం జోన్-2 ఏసీపీ డి. లక్ష్మణరావు వెల్లడించారు. వడ్లపూడి ఆర్‌హెచ్ కాలనీకు చెందిన కర్రి మహేష్ పై భౌతిక దాడి చేయడంతో రూ.7250 నగదు బదిలీ చేయించుకున్న ఆరుగురిని మంగళవారం అగనంపూడి ఓల్డ్ ఐస్ ఫ్యాక్టరీ వద్ద అరెస్ట్ చేశారు. వారి నుంచి రూ. 5 వేలు నగదు, సిల్వర్ చైన్, మొబైల్ ఫోన్, కత్తి స్వాధీనం చేసుకున్నారు.

పోర్టు యాజమాన్యమే ఆస్పత్రిని నిర్వహించాలి

తాటిచెట్లపాలెం : పోర్టు హాస్పిటల్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా సీఐటీయూ, పోర్టు కార్మిక సంఘాల ఆధ్వర్యంలో జరుగుతున్న రిలే నిరాహారదీక్షలు మంగళవారం నాటికి 92వ రోజుకు చేరాయి. ఈ సందర్భంగా సీఐటీయూ నాయకుడు వీఎస్ పద్మనాభరాజు మాట్లాడుతూ మెరుగైన వైద్యం అందించడానికే పోర్టు హాస్పిటల్‌ను కార్పొరేట్‌కు ఇస్తున్నామని చెప్పడం అబద్ధమని... విలువైన భూములను చౌకగా కాజేయడానికి ఈ నిర్ణయం తీసుకున్నారని ఆరోపించారు. గత 92 రోజులుగా పోరాటం చేయడం వల్లే హాస్పిటల్ టెండర్లు వేయడానికి వెనకడుగు వేశారన్నారు. సుమారు 40 వేల మంది ఉద్యోగులు, వారి కుటుంబ సభ్యులకు వైద్య సేవలు అందించే ఆస్పత్రిని ప్రైవేటుకు అప్పగించడం దారుణమన్నారు. కోట్ల రూపాయలు ఆర్జిస్తున పోర్టు యాజమాన్యమే ఆస్పత్రి నిర్వహణ బాధ్యత తీసుకోవాలని డిమాండ్ చేశారు. కె.సత్యనారాయణ, వీఎస్ మూర్తి, కేఎస్ కుమార్, రాఘవులు, విజయ్‌కుమార్, నాయుడు, ప్రభుదేవా, అన్నపూర్ణ, బాలకృష్ణ, లక్ష్మీ, దేవి, తదితరులు పాల్గొన్నారు.